ఒక్కు ఒక్కుమని చావుకోసం ఎదురుచూసే ముసల్దాని ఒంటిమీద పేలికలైన నల్లటి చీరలా ఉన్న తారు రోడ్డు 'నా పేరు పబ్లిక్ రోడ్డ'ని చెప్పుకుంటుంది. జీవితంలో అన్నిటిని కోల్పోయి మొండిగా బతికేస్తున్న మధ్య తరగతి మనిషిలా — 'నాకూ మంచి రోజు వస్తుంది. నేనూ బాగుపడతాను' అన్నట్లు ధీమాగా ఆశ పెంచుకుంటుంది. ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు, కార్లున్న వాళ్ళు, కాలినడక వాళ్ళు అనే భేదం చూపించకుండా 'మీరంతా నా దృష్టిలో ఒకటే' అంటూ ఓ పెద్ద సోషలిస్టులా కనిపిస్తుంది.

పెద్దవాళ్ళ ఆలనకు, పాలనకు నోచుకోని రోడ్డది. ఇటు ఆరుమైళ్ళ అవతల ఉన్న టౌన్నూ, అటు అరవై మైళ్ళ దూరంలో ఉన్న అరుకునూ కలిపే రోడ్డు. ఎప్పుడైనా, ఎవరైనా మంత్రిగారు ఈ రోడ్డుమీద రావడం తప్పదనుకుంటే, మునిసిపాలిటీ వాళ్ళు ముచ్చటగా మూడు గంటల్లో మరమ్మత్తులు చేసి, కొత్త రోడ్డులా కనిపించేలా పాత రోడ్డును ముస్తాబు చేస్తారు. మంత్రిగారు వస్తారు. రోడ్డుకిరుపైపుల ఉన్న ప్రజావాహినికి నవ్వుతూ నమస్కారాలు పెడతారు. మంత్రిగారు వెళ్ళిపోతారు. మరి రెండు రోజుల్లో చిన్న వాన జల్లు పడుతుంది. రోడ్డు ముస్తాబు చెరిగిపోతుంది. మళ్ళా పాత రోడ్డు పాత రోడ్డయి పోతుంది. గాయాల్లాంటి గతుకులు, గతుకుల్లో రక్తంలాంటి వర్షం నీళ్ళు, చిందరవందరగా ముసిరిన ఈగల్లా రోడ్డుమీద అక్కడక్కడ కంకరరాళ్ళు, మందు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిన క్షయ రోగి లాంటి శుభ్రత కళ్ళజబ్బు ఉన్న వాళ్లకు కూడా చక్కగా కనిపిస్తాయి.

చచ్చిన వాడి కళ్ళు చారడేసి అన్నట్లు రోడ్డు ఎలా ఉన్నా, రోడ్డుకి రెండు పక్కలా డబ్బు గడించడం అంటే ఏమిటో తెలుసుకున్న వాళ్ల పెద్ద పెద్ద దుకాణాలు, ఏ పెట్టుబడి లేకుండా చీటీలు రాసి డబ్బులు సంపాదించే జ్రాకెట్టు కుర్రవాళ్ల బల్లలు, వచ్చే పోయే సిటీ బస్సుల హోర్డింగులు, వాటికోసం ఎదురుచూసే అందమైన కాలేజీ అమ్మాయిలు, ఆడపిల్లల మనసులో సెల్యులాయిడ్‌లా అచ్చయి పోవాలని వెర్రి వేషాలు వేసే అబ్బాయిలు, ఆఫీసు టైముకు అందుకోవాలని ఆరాటపడే ఉద్యోగస్థులు, వాళ్ళందరికోసం అన్నట్లు బస్సుస్టాపు లాంటి ఓ పెద్ద మర్రి చెట్టు ఉన్నాయి. అక్కడ వింతలు జరుగుతాయి; విడ్డూరాలూ జరుగుతాయి. రాజకీయాలు, కుతంత్రాలు, ఇంకా చాలా చాలా జరుగుతాయి. నిత్యకళ్యాణం పచ్చతోరణంలా ఆ వాతావరణం అంతా సందడిగా ఉంటుంది.

ఆ పబ్లిక్ రోడ్డును నేను మూడేళ్ల నుండి చూస్తున్నాను. 'పచ్చని పైరులో దిష్టిబొమ్మలా ఎంతో సందడిగా ఉన్న చోట పగిలిపోయిన ఈ రోడ్డుపట్ల ఎవరూ శ్రద్ధ తీసుకోరెందుకు చెప్మా?' అనుకునే వాణ్ణి మొదట్లో. తరవాత తెలిసింది — ఈ వార్డు కౌన్సిలర్ ఛైర్మన్‌గారికి ఎలక్షన్‌లో ఓటు వెయ్యలేదని. బాడ్ లక్! అయిదేళ్ళు పూర్తి కావాలి. ఈ వార్డు ఎమ్. పి. మారిపోవాలి; లేదా ఆ ఛైర్మన్ గారు వచ్చే ఎలక్షన్‌లో ఓడిపోవాలి. అంతవరకు ఈ రోడ్డు బాగుపడదు.

ఉదయం తొమ్మిదయ్యేసరికి రోజూ రోడ్డు పక్కకు చేరతాను. నా బస్సు వచ్చే వరకు దాన్ని చూస్తూ ఉంటాను. అది తన బాధలు నాతో చెప్పుకుంటున్నట్లు అనిపిస్తుంది. జాలిపడతాను. అది చెప్పుకుపోతున్న కథలు వింటున్నట్లు ఉంటుంది. నవ్వుకుంటాను. ఓ అరగంట గడుస్తుంది. నా బస్సు వస్తుంది. నేను వెళ్ళిపోతాను. మర్నాడు మామూలే! ఇది ప్రతి రోజూ జరిగే కథ. వెరైటీ లేని చప్పని కథ. కానీ, ఆ రోజు పట్టపగలు పది మంది చూస్తుండగా ఆ పబ్లిక్ రోడ్డు మీద వెరైటీ ఉన్న ఓ పెద్ద కథ జరిగిపోయింది. మామూలుగా కాదు, ఫుట్‌పాత్ మీద సర్కస్‌లా, పేదవాడికి చేసిన ఆపరేషన్‌లా, ఉన్నవాడు లేనివాడికి లేదని చెప్పినంత తేలికగా జరిగిపోయింది.

ఉదయం తొమ్మిదయింది. కాలచక్రం కళ్ళు మూసుకొని తిరుగుతుంది. నిన్నటికి, ఈ రోజుకి మధ్య ఏమాత్రం భేదం కనిపించటం లేదు.

బస్సుస్టాపు (సో కాల్డ్) లో చాలా మంది ప్రయాణికులు ఉన్నారు. అర గంట గడిచినా ఒక్క సిటీ బస్సూ

-శ్రీ రాజ్

సరిపెట్టుకున్నాను. ఇంటికి వెళ్ళి పోయాను.

## 2

ముందు రోజు రాత్రి పడిన వర్షం మూలంగా దాదాపు రోడ్డంతా బురదగా ఉంది. మర్రిచెట్టు కింద కుర్చీలు, బల్లలు వేసి ఉన్నాయి. వాటిమీద పెద్ద వాళ్ళు, పెద్ద ఉద్యోగా లున్నవాళ్ళు, పెద్దవాళ్ళని ఆశ్రయించి పెద్దవాళ్ళు అయిపోవాలని తాపత్రయ పడేవాళ్ళు కూర్చున్నారు. బస్సులకోసం ఎదురు చూసే నాలాంటి చాలా మంది చెట్టు కివతల నిలుచున్నారు. వచ్చే పోయే బస్సులు చెదరగొట్టే బురద నీళ్ళు బట్టల మీద పడకుండా అవస్థ పడు తున్నారు.

చనిపోయిన ఆ కుర్రవాడి గురించి చెట్టుకింద పంచాయతీ ఏర్పాటు చేశారని అంతా అనుకుంటున్నారు. నాకెందుకో ఆ పంచాయతీ చూడాలని ఆసక్తి కలిగింది. నేనూ చెట్టుకిందికి చేరాను.

కూర్చున్న అందరిలో ఒకతను చాలా దర్పంగా కనిపించాడు. నాలుగు వేళ్ళకు పొళ్ళ ఉంగరాలు, మెడలో పులిగోరు, సన్నని గ్లాస్కో బట్టలు, ఎలాంటి వాళ్ళనైనా ఇట్టే కొనగలిగే ధీమా నిండిన కళ్ళు, తన కంటె గొప్పవాడు మరొక డుండడనే పొగరు చూపించే కోరమీసాలు —చూడగానే బస్సు ఓనరని తక్కున గుర్తించవచ్చు. అతనికి ఆ పక్క, ఈ పక్క చాలా మంది పెద్దవాళ్ళు కూర్చున్నారు. పెద్ద పోలీసు ఉద్యోగులు ఉన్నారు. ఊరి మునసబు, కౌన్సిలరు, ఇంచుమించు పెద్దవాళ్ళంతా ఉన్నారు. వాళ్ళ కాళ్ళ దగ్గర ఓ ఆడ మనిషి కూర్చుంది. ఆమె ఒంటికి ఉన్న మురికి, ఆమె శరీరాన్ని పూర్తిగా కప్పలేకపోతున్న చిరుగుల బట్టలు, గాలికి పిచ్చిగా ఎగురుతున్న ఎర్రని జుత్తు — ఆమె దరిద్రాన్ని ఒంటికి చుట్టుకున్నట్లు ఉంది. మంచి చిత్రకారు డెవరైనా ఆ ముసల్దాని బొమ్మ గీసి అమ్ముకుంటే, ఆత నొక చిన్న కారు కొనవచ్చు; లేదా ఓ చిన్న గెస్ట్ హౌస్ కట్టించవచ్చు. ఫారిన్‌లో కూడా పెద్ద పేరు సంపాదించవచ్చు. నేనూహించుకున్న ఆ కుర్రవాడి చింపిరి జుత్తుల ముసలిదానికీ, ఈమెకూ భేదం లేదు. ఆమె పిచ్చి మొక్కల్లా ఎదుగుతున్న తన ముగ్గురి పిల్లల్ని పట్టుకు కూర్చుంది. ఆమెకు ఏమీ లేకపోయినా నిండుగా మమకారం ఉంది. తన బిడ్డల మీద తరగని ప్రేమ ఉంది. తన పిల్లల మీద పెంచుకుంటున్న ఆశలు ఆమె కళ్ళలో కనిపిస్తున్నాయి. ఆశలు నిలుపుకుంటున్న తన నలుగురిలో ఒకడు మట్టి పాలయి పోయాడు. మిగిలిన వాళ్ళు ఏమైపోతారో అన్నట్లు వాళ్ళను చుట్టుకు కూర్చుంది. వాళ్ళను చూసిన తరవాత దరిద్రం ఇంత దరిద్రంగా ఉంటుందా అనిపించింది నాకు.

ఆఫీసుకి వెళ్ళటానికి చాలా టైమ్ ఉంది. జరగబోయే పంచాయతీ చూడా లనిపించింది.

పంచాయతీ ప్రారంభించారు. దర్యాప్తులు, విచారణలు సాగించారు. వాళ్ళ సంభాషణ డ్రమెటిక్‌గా జరిగిపోతూంది. అంతా ఆసక్తిగా వింటున్నారు. మునసబు తనకు తోచిన సలహాలు ఇస్తున్నాడు. కౌన్సిలరు అది బాగులేదు, మరో సెటిల్ మెంటు చెయ్యాలని అంటున్నాడు. తప్పంతా కుర్రవాడిదే నని సాక్ష్యం ఇస్తున్నారు మరికొందరు.

"మా బస్సు కింద ఇంతవరకు ఎవడూ పడి చావలేదు. మా డ్రైవర్లంతా మంచి నేర్పున్నవాళ్ళు. ఈ కుర్రగాడు పడి మా బస్సు సర్వీసుకే చెడ్డపేరు తెచ్చాడు. దరిద్రుడు!" బస్సు యజమాని దగ్గరి బంధువు విసుక్కున్నాడు.

బస్సుగల ఆయన ఏమీ మాట్లాడలేదు. అన్నిటికీ ఓ చిన్నసైజు నవ్వు నవ్వేస్తున్నాడు. ఎనభైవేల రూపాయలు పెట్టి భూతంలాంటి బస్సు తీసుకున్న అతనికి — ఆఫ్టరాల్ ఎనిమిదేళ్ళ పసివాడి ప్రాణాన్ని కొనడం ఏమంత కష్టంకాదు. అయితే, జరగవలసిన తంతులన్నీ జరగాలి గనక ఊరుకుంటున్నాడు. తన అమూల్యమైన కాలాన్ని వృథాచేసుకొని పంచాయతీకి హాజరయ్యాడు. ఏదో ఒకటి త్వరగా తేల్చండన్నట్లు అప్పుడప్పుడు పెద్దవాళ్ళ ముఖాల్లోకి చూస్తున్నాడు.

ఆ ముసల్ది ఏడవడం మొదలు పెట్టింది. మరెవరూ మాట్లాడకుండా ఊరుకున్నారు. మరి కాసేపటికి ఆమె కళ్ళు తుడుచుకుంటూ అంది: "నాను బిడ్డల్ని సూసుకుంటూ బతుకుతున్నాను, బాబూ! సూసుకుంటున్నోళ్ళలో ఓడు ఎలిపోనాడు ... నన్నొగ్గేసినాడు. తప్పు ఆడిదో, మీదో ఆ పయోడికే తెలాలి! పోయినోడు తిరిగొత్తాడా ఏటి, బాబూ! ఈ కేసులూ, పోలీసోల్లెందుకు? నా కొడుకును తీసుకొత్తాయా? అంతా బ్రెమ ... బాబూ! మాకే కేసులూ వద్దు... ఏటీ వద్దు ... వద్దు, బాబూ! పెద్దోల్లితోటి మాకు పోటీ వద్దు... ఆ సచ్చినోడికి నాలుగు డబ్బు' లిప్పించండి. అన్నేయం మాత్రం సెయ్యకండి. పిల్లలున్న దాన్ని, బాబూ! ఒకొంత ఎక్కువిప్పించండి... మా పేదోళ్ళకి అది సాలు." చాలా తేలికగా, నిర్వికారంగా అంది. ఆ మాటల్లో తనకూ డబ్బు కావాలనే స్వార్థం పేరుకుపోయింది.



ఎవరికోసం? చిత్రం—వై. బాలయ్య (సిద్దిపేట)

బస్సు యజమాని తృప్తిగా నవ్వాడు. మిగిలిన వాళ్ళంతా సమస్యే తీరిపోయిందన్నట్లు ఒకరి ముఖా లొకరు చూసుకొని తృప్తిపడిపోయారు. తేలికగా గాలి పీల్చుకున్నారు.

నేను ప్రమాస్పడిపోయాను. ఆ ముసల్ది నిజంగా ఆ కుర్రవాణ్ణి కన్న తల్లి అవునా, కాదా అని అనుమానం కలిగింది. కన్న కొడుకు ప్రాణానికి ధరకట్టి ఇమ్మని అడుగుతున్న ఆమె మీద జుగుప్స రేగింది. పోయిన కుర్రవాడు తిరిగి రాకపోవచ్చు. కోర్టు తన కొడుకుదే తప్పని తీర్పు ఇవ్వవచ్చు. మరేదైనా అన్యాయం జరగవచ్చు. కానీ, కన్న తల్లి తనకు తానుగా 'ఇంత ఇవ్వండి' అని అడగలేదు. కడుపు తీపి మాట్లాడనివ్వదు. డబ్బు ఇస్తున్నా, దాన్ని తీసుకోవటానికి ఆమె చేతులు వణికి పోతాయి. తన కొడుకును పొట్టన పెట్టుకొని ప్రాణం లేని కాగితాలు తన చేతి కిస్తున్నారని ఆమె గొల్లున ఏడుస్తుంది. ఆ మమకారం అలాంటిది. ఆ ప్రేమ అలాంటిది. ఆ బంధం అలాంటిది. కానీ, ఈ ముసల్ది 'ఒకొంత ఎక్కువిప్పించండి' అని పబ్లిక్‌గా అడుగుతూంది.

మరి కాసేపు ఆ వింతను చూడాలనిపించలేదు నాకు. అక్కడ ఉండలేక పోయాను.

మనిషి తయారుచేసుకున్న డబ్బు మీద మనిషికే మక్కువ ఎందుకో? ఉన్న వాళ్ళకూ డబ్బే కావాలి! లేనివాళ్ళకూ డబ్బే కావాలి! చిన్న విషయానికి డబ్బే ఏకావాలి. పెద్ద విషయానికి డబ్బే అవసరం. డబ్బుకోసం మనిషి కక్కుర్తి పడిపోతున్నాడు. డబ్బుకోసం ప్రాణాలు తీస్తున్నాడు. ఆ డబ్బుతో ప్రాణాల్ని కొంటున్నారు. డబ్బుకోసం ప్రాణాల్ని అమ్ముతున్నారు. మమకారాలు చంపుకుంటున్నారు. బంధాలు మరిచిపో తున్నారు. కన్న కొడుకు ప్రాణాలతో కన్న తల్లే వ్యాపారం చేస్తూంది. కన్న వాడు పోయాడనే బాధ లేదు. వాడి నిండు

ప్రాణానికి డబ్బు కావాలనే ఆశ ఉంది. ప్రతి మనిషి జీవితంలో డబ్బు కావాలనే తపన ప్రైమరీ పార్టయిపోయింది. ఈ అనుబంధాలూ, అనురాగాలూ కేవలం సెకెండరీగా మారిపోయాయి.

ఆఫీసులో పని చేస్తున్నా, నాలో ఆలోచనలు పరిపరివిధాల ముసిరి చుట్టుకొని నన్ను విడిచి పెట్టలేదు.

ఒకవేళ — తన కున్న పరిస్థితులే ఆ ముసల్దాన్ని అలా ప్రేరేపించాయేమో? కట్టుకున్న వాడు లేక, కన్నవాళ్ళను పెంచలేక, చనిపోయిన వాడి మీద మమకారం చంపుకోలేక, మిగిలి ఉన్న వాళ్ళ ప్రాణాల్ని కాపాడుకోవటానికి డబ్బు ఇమ్మని అడిగి ఉండవచ్చు. పరిస్థితులు మనిషిని దేనికైనా దూరం చేస్తాయి. పోయిన వాడు తిరిగి రాడు. తిరిగి రాని వాడికోసం కోర్టులు తిరిగినా కడుపుకోత తీరి రాదు. న్యాయం, అన్యాయం ఉన్న వాడినే ప్రేమిస్తాయి; ఆశ్రయిస్తాయి. కన్న పాపానికి కాంపన్సేషన్ కూడా లేదంటారు. కేసు కొట్టేస్తారు. అందుకే కాబోలు ముసలి అన్నీ ఆలోచించి డబ్బు ఇమ్మని అడిగింది, నిజానికి ఏ స్త్రీ తన కొడుకు ప్రాణానికి వెల కట్టి ఇమ్మని అడగదు. ఆ మమకారానికి ధర లేదు.

మనసుని సరిపెట్టుకొనే ఆలోచనలు నన్ను తృప్తిపరచలేకపోయాయి. మనసులో అవ్యక్తమైన ఆందోళన బయలుదేరింది.

* * *

మర్నాడు ఉదయం ఆఫీసుకి బయలుదేరే ముందు మా అమ్మతో అన్నాను: "అమ్మా! నే నెప్పుడైనా బస్సు కింద పడి చచ్చిపోయాననుకో ... అప్పుడు నువ్వు నా ప్రాణానికి ఏమాత్రం డబ్బు అడిగి తీసుకుంటావు?" ఇది తెలివి తక్కువ ప్రశ్న అని బాగా తెలుసు నాకు.

నా అమ్మ ఒక్కుమ్మడిగా ఉగ్రమూర్తి అయింది.

"ఒరేయ్ ... పిచ్చి వాగుడు కట్టిపెట్టి నోరు మూసుకో. కథలూ కాకరకాయలూ అంటూ ఇరవై నాలుగ్గంటలూ ఆలోచిస్తుంటే మనకీ మాలిన ప్రశ్నలే బుర్రలో ఉంటాయి... పిల్లల్ని కనడమంటే వాళ్ళ ప్రాణాల్ని అమ్ముకోవటానికట్రా?"

తరవాత జరిగిందంతా చెప్పాను.

"పాపిష్టిది... దానిది మనసు కాదు, పాషాణం. అందుకే చనిపోయిన వాడి మీద డబ్బు సంపాదిస్తూంది... అసలు అది ఆ కుర్రవాడి తల్లి అంటే నాకెందుకో నమ్మకం లేదురా... కన్న తల్లి పిల్లల ప్రాణాలకి ఖరీదు కట్టదు, డబ్బు ఇమ్మని అడగదు. కడుపులో దుఃఖం మాట్లాడనివ్వదు. కసాయిముండ. డబ్బు అడగటానికి దాని నోరెలావచ్చిందో!"

ఆ ముసల్ది ఆ కుర్రవాడి కన్నతల్లి కాకుండా ఉంటే బాగుండుననుకున్నాను.

నాకు తెలిసి ఉన్న వాళ్ళను ఏదో సందర్భంలో కల్పించుకొని ఈ ప్రశ్న అడిగాను. ఇంచుమించు అంతా ఒకే సమాధానం ఇచ్చారు. ఆ సమాధానం నే నూహించిన దానికి భిన్నంగా లేదని చెప్పవచ్చు.

నిజానికి ఆ చనిపోయిన కుర్రవాడు నాకు ఏమీ కాడు. అతని తల్లి అంతకంటె నాకు తెలియదు. వాడు చనిపోయాడు. వాడి ఎనిమిదేళ్ళ బ్రతుక్కి వెల కట్టి ఆ ముసల్ది డబ్బు తీసుకుంటూంది. అది వాళ్ళ వ్యక్తిగత విషయం. కాని, వాళ్ళ గురించి ప్రతిక్షణం నేను ఎందుకు ఆలోచిస్తున్నానో నాకే అర్థం కావటం లేదు.

పంచాయతీ జరిగిన రెండవ రోజు నుండి పదకొండవ నంబరు బస్సు తిరగడం మొదలుపెట్టింది. బస్సు యజమాని ఆ కుర్రవాడి ప్రాణాలు కొనుక్కున్నాడు.



అలంకరించుకొని... చిత్రం — వై. బాలయ్య (సిద్దిపేట)

## 3

సరిగా రెండు వారాలు గడిచాయి.

నేను రోడ్డు చేరేసరికి రోడ్డుమీద చాలా జనం గుమికూడి ఉన్నారు. ఏడుపులూ కేకలూ వినిపిస్తున్నాయి. మళ్ళా ఏదైనా ప్రమాదం జరిగిందేమోనని అనుకుంటూ గుంపు మధ్యకు వెళ్ళాను.

అంతమందిలో కొట్టవచ్చినట్లు చనిపోయిన ఆ కుర్రాడి తల్లి కనిపించింది. నేను ఆశ్చర్యపోయాను. ఒక పోలీసు దుశ్శాసనుడులా ముసల్దాని రెక్క పుచ్చుకొని లాగుతున్నాడు. మరో పోలీసు లాఠీతో కొడుతున్నాడు. మధ్య మధ్య తిడుతున్నాడు. ఆ ముసల్దాని ముగ్గురు పిల్లలు ఏడుస్తున్నారు. ఆ ధోరణి నాకు బొత్తిగా అర్థం కాలేదు. ఏం జరిగిందని ఒక పోలీసుని అడిగాను.

"ఇది దొంగముండండి! ... ఆ మధ్య బస్సుకింద పడి ఓ కుర్రాడు చచ్చిపోయాడు. ఆడి తల్లినని చెప్పి బస్సోడి దగ్గర డబ్బు లాక్కుందండి... తీరా సూస్తే ఇది ఆ సుంటడి తల్లి కాదండి... అడుక్కునే ముండ... ఇది అడుక్కుంటాది. పిల్లగాళ్ళు అడుక్కుంటారు. ఆ కుర్రగాడు దీని సంత సేరాడు. ఆడికి అడుక్కుతినడం నేర్పించింది. ఆడు దీనికి సొంతాన కొడుకు కాడు, ఏమీ కాడు ... మరో ఊరోడు. ఆడమ్మా, బాబూ సేమంగా ఉన్నారు. ఆళ్ళు సెప్పేనే తెలిసింది, ఆ సుంటడు దీని కొడుకు కాదని ... అబద్ధాల ముండ..." లాఠీతో మరో రెండు దెబ్బలు ముసల్దాని ఒంటిమీద వేశాడు.

"అంత తెలుసుకోకుండా, ఆరాకే తీయకుండా మీవాళ్ళు ముసల్దానికి డబ్బెలా ఇప్పించారు? చనిపోయిన కుర్రవాడి తల్లి అని ఎలా నమ్మారు?" అని ప్రశ్నించాను.

"ఏటి, బాబూ! అంతా డబ్బుమయం. ఉన్నోళ్ళు సిక్కుల్లో పడతారా ఏటి? ఆల బస్సులు నడాల ... ఆల కంపెనీలు నడాల. అన్నిటికీ డబ్బిచ్చేసి సేతులు దులిపేసుకుంటారు. ఆల మాట అంతా ఇనుకుంటారు ... ఏం సెప్పమంటారు? అలాటి ప్రెస్నలన్నీ మా పెద్దోళ్ళ నడిగి తెల్సుకోవాల ... నడే, దొంగ నాయాలా ..." అంటూ ముందుకి తోసుకుంటూ నడిచాడు కానిస్టేబుల్.

ఔను, నిజమే. ఆ కానిస్టేబుల్ నా ప్రశ్నలకు ఏమి సమాధానం ఇవ్వగలడు? ఉన్నదాన్ని తనకు తెలిసిన రీతిలో స్పష్టంగా చెప్పాడు.

పెద్దవాళ్ళంతా ఆ రోజు అదే ముసల్దాన్ని చనిపోయిన ఆ కుర్రవాడి కన్నతల్లి అన్నారు. పంచాయతీ జరిపించారు. కాంపెన్సేషన్ ఇప్పించారు. గొడవ పోయిందనుకొన్నారు. పార్టీలు చేసుకున్నారు. ఈ రోజు — ఆ ముసల్ది కన్న తల్లి కాదని తెలిసింది. తన్ని తీసుకు రమ్మన్నారు. పోలీసులు తమ డ్యూటీ చేస్తున్నారు. ముసల్దాన్ని పట్టుకు తీసుకు వెళుతున్నారు. ఉన్నవాళ్ళు డబ్బుకోసం ధైర్యంగా అన్యాయాలు చేస్తున్నారు. లేనివాళ్ళు దానికోసం గడ్డి కరుస్తూ నీచంగా ప్రవర్తిస్తున్నారు. వాళ్ళకూ, వీళ్ళకూ భేదం లేదు.

ఆ ముసల్ది చనిపోయిన కుర్రవాడి కన్న తల్లి కాదని తెలిసి నే నెంతో తృప్తి పడ్డాను. కొడుకు ప్రాణానికి ధర కట్టి డబ్బు తీసుకొనే తల్లి ఎక్కడా ఉండదనే ఆ నిజం నిజంగా మిగిలినందుకు సంతోషించాను. ★